సూర్య
www.suryaa.com
19వ వసంతంలోకి..

EVENING EDITION
నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com

4 PM
www.suryaa.com
శుక్రవారం
28-11-2025
పేజీలు: 02



## వధువు వరుడిగా.. వరుడు వధువుగా రెడీ!

ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం జిల్లా, యర్రగొండపాలెం మండలం కొలుకులలో జరిగిన ఒక వివాహం అందరినీ ఆశ్చర్యపరిచింది. బత్తుల శివ గంగురాజు, నందినిల పెళ్లిలో వారి కుటుంబ ఆచారం ప్రకారం, వధువు వరుడిగా, వరుడు వధువుగా వస్త్రధారణ చేసుకున్నారు. విచిత్రమైన ఈ వేషధారణతోనే నూతన వధూవరులు బంధుమిత్రులతో కలిసి ఊరేగింపుగా వెళ్లి స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు.




## పృథ్వీరాజ్ సుకుమారన్ తల్లి మల్లికా సంచలన ఆరోపణలు

ప్రముఖ మలయాళ నటుడు, దర్శకుడు పృథ్వీరాజ్ సుకుమారన్‌పై ఉద్దేశపూర్వకంగా సైబర్ దాడి జరుగుతోందని ఆయన తల్లి, సీనియర్ నటి మల్లికా సుకుమారన్ ఆరోపించారు. తన కొడుకును ఒక నటుడిగా సినీ పరిశ్రమ నుంచి తొలగించేందుకు (erase) కావాలనే కొందరు కుట్ర పన్నుతున్నారని.. అతడి కెరీర్‌ను అంతం చేయాలని కొందరు భావిస్తున్నారని ఆమె తీవ్ర వ్యాఖ్యలు చేశారు. మలయాళ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో మల్లికా సుకుమారన్ మాట్లాడుతూ- - - పృథ్వీరాజ్ సుకుమారన్‌ను లక్ష్యంగా చేసుకుని ఈ సైబర్ దాడి జరుగుతోంది. ఇది అతడిని ఒక నటుడిగా పరిశ్రమ నుంచి తొలగించడానికి ఉద్దేశపూర్వకంగా చేస్తున్న ప్రయత్నం అని నేను భావిస్తున్నాను. పృథ్వీరాజ్ గురించి సోషల్ మీడియాలో నిరంతరం తప్పుడు ప్రచారం జరుగుతుంది. అతడి తాజా చిత్రం విలాయత్ బుద్ధ' సినిమా విడుదలకు ముందు ఇలాంటి నెగటివ్ ప్రచారం పెంచడం వెనుక ఒక గ్రూప్ పని చేస్తోందని ఆమె ఆరోపించారు. కేవలం వృత్తిపరంగానే కాకుండా, పృథ్వీరాజ్‌కు వ్యక్తిగత స్థాయిలో ఇబ్బందులు సృష్టించేందుకు కూడా కొందరు ప్రయత్నిస్తున్నారని ఆమె వాపోయారు. పృథ్వీరాజ్ సుకుమారన్ ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'విలాయత్ బుద్ధ'. జయన్ నంబియార్ దర్శకత్వంలో యాక్షన్ థ్రిల్లర్‌గా ఈ చిత్రం తెరకెక్కింది. నవంబర్ 21న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకువచ్చింది. అయితే ఈ సినిమా విడుదలైన తర్వాత నుంచి పృథ్వీరాజ్‌పై కొందరూ కావాలని టార్గెట్ చేసి కామెంట్లు పెడుతున్నట్లు మల్లిక ఆరోపించింది.




## సీఎం పదవిపై ముదిరిన వివాదం

కర్ణాటకలో ముఖ్యమంత్రి పదవిపై వివాదం మరింత ముదిరింది. సీఎం సిద్ధరామయ్య, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ మధ్య మాటల యుద్ధం మొదలైంది. సోషల్ మీడియా వేదికగా ఆ ఇద్దరూ ఒకరిపై మరొకరు పరోక్ష విమర్శలు చేసుకున్నారు. దాంతో వారి మధ్య నిగూఢంగా సాగిన విభేదాలు బహిర్గతమయ్యాయి. ఫలితంగా కాంగ్రెస్ అధిష్ఠానం రంగంలోకి దిగి పరిస్థితిని చక్కదిద్దే ప్రయత్నాలు మొదలుపెట్టింది. డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ గురువారం ఎక్స్ వేదికగా చేసిన ఓ పోస్టు వివాదానికి ఆజ్యం పోసింది. 'మాటకు ఉన్న శక్తే ప్రపంచ శక్తి. ఇచ్చిన మాట నిలబెట్టుకోవడమే ప్రపంచంలో అతిపెద్ద బలం' అని డీకే తన పోస్టులో పేర్కొన్నారు. 2023లో ప్రభుత్వం ఏర్పడినప్పుడు కుదిరినట్లుగా చెబుతున్న రెండున్నరేళ్ల అధికార మార్పిడి ఒప్పందాన్ని గుర్తుచేయడానికే డీకే ఈ పోస్టు పెట్టారని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. అయితే డీకే పోస్టుకు సిద్ధరామయ్య కూడా అదే తరహాలో బదులిచ్చారు. 'మాట ప్రజలకు మంచి చేయలేనప్పుడు ఆ మాటకు శక్తి ఉండదు' అని కౌంటర్ ఇచ్చారు. తమ 'శక్తి' పథకం ద్వారా మహిళలకు 600 కోట్లకు పైగా ఉచిత ప్రయాణాలు అందించామని గుర్తుచేశారు. ప్రజలు తమకు ఐదేళ్ల పూర్తికాలానికి అధికారం ఇచ్చారని, తమ మాట నినాదం కాదని, అదే తమకు ప్రపంచమని స్పష్టంచేశారు. కాగా, ఈ మాటల యుద్ధంపై కర్ణాటక బీజేపీ వ్యంగ్యాస్త్రాలు సంధించింది. ఇది శక్తి గురించి కాదని, కుర్చీ గురించేనని ఎద్దేవాచేసింది. అంతేకాదు డీకే శివకుమార్‌ను ట్యాగ్ చేయాలంటూ సిద్ధరామయ్యను ఉద్దేశించి పోస్ట్ చేసింది. ఈ క్రమంలో వివాదంపై కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే స్పందించారు. సమస్య పరిష్కారానికి త్వరలోనే ఇద్దరు నేతలతో సమావేశం ఏర్పాటు చేస్తామని, సోనియా గాంధీ, రాహుల్ గాంధీలతో చర్చించాకే తుది నిర్ణయం ఉంటుందని స్పష్టంచేశారు.



## ఫాస్ట్‌ట్యాగ్ వార్షిక పాస్: రూ.3000తో 200 టోల్‌లు

భారత జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ ఆగస్టులో దేశవ్యాప్తంగా 'ఫాస్ట్‌ట్యాగ్ వార్షిక పాస్'ను ప్రారంభించింది. రూ.3,000 విలువైన ఈ పాస్‌తో ఏడాది పాటు గరిష్టంగా 200 టోల్‌లు లేకపోతే, రూ.3,000 అయ్యే వరకు జాతీయ రహదారులు, ఎక్స్‌ప్రెస్‌వేలలో ప్రయాణించవచ్చు. ఇది వాణిజ్యేతర వాహనాలకు మాత్రమే వర్తిస్తుంది. హైవే యాత్ర యాప్, NHAI వెబ్‌సైట్ ద్వారా ఈ పాస్‌ను పొందవచ్చు. ఈ సౌకర్యం FASTag వినియోగదారుల అనుభవాన్ని మెరుగుపరచడమే కాకుండా, ప్రయాణాన్ని మరింత పొదుపుగా, సజావుగా మారుస్తుందని కేంద్రం తెలిపింది.




## పంచాయతీ ఎన్నికల నిర్వహణపై హైకోర్టు సంచలన ఉత్తర్వులు


తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ కోసం ఈ నెల 22న ప్రభుత్వం జీవో నెం.46ను విడుదల చేసింది. ఈ జీవో ప్రకారం రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల రిజర్వేషన్లు మొత్తం కలిపి 50 శాతం దాటకూడదని ప్రభుత్వం నిర్ణయించింది. అయితే ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకిస్తూ కొందరు వ్యక్తులు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. తాజాగా ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయస్థానం కీలక ఉత్తర్వులు జారీ చేసింది. ఈ దశలో రాష్ట్రంలో ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం విడుదల చేసిన జీవో నెం.46పై స్టే విధించలేమని స్పష్టం చేశారు. విచారణ సందర్భంగా కోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. సబ్ కేటగిరీ రిజర్వేషన్ లేనందుకు ఎన్నికలు రద్దు చేయాలని మీరు కోరుకుంటున్నారా అని పిటిషనర్‌ను కోర్టు ప్రశ్నించింది. కాగా ఎలక్షన్ నోటిఫికేషన్ వచ్చాక కోర్టుల జోక్యం ఉండకూడదన్న EC అడ్వకేట్ తెలిపారు. దీనిపై కోర్టు స్పందిస్తూ.. 42% రిజర్వేషన్ జీవో విచారణ సమయంలో.. పాతపద్ధతిలో ఎన్నికలు నిర్వహించాలని మేమే చెప్పాం కదా అని హైకోర్టు తెలిపింది. అయితే 2009లో ఇదే పరిస్థితి వచ్చినప్పుడు GHMC ఎన్నికను రద్దు చేశారని పిటిషనర్ తరపు న్యాయవాది కోర్టు దృష్టికి తీసుకెళ్లారు.. అయితే దీనిపై స్పందించిన కోర్టు ఎన్నికలు నిర్వహించాలని మేమే ఆదేశించి.. మళ్లీ మేమే ఎలా స్టే విధిస్తామని తెలిపింది. ఈ సందర్భంలో డెడికేటెడ్ కమిషన్ నివేదికను బహిర్గతం చేసి.. కాపీ ఇవ్వాలన్న పిటిషనర్ తరపు న్యాయవాది కోరగా.. దీనిపై ఎలాంటి ఆదేశాలు ఇవ్వలేమన్న హై కోర్టు స్పష్టం చేసింది. అలాగే సబ్ కేటగిరీ రిజర్వేషన్లపై ఆరు వారాల్లోపు కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. అనంతరం తదుపరి విచారణ 8 వారాలకు వాయిదా వేసింది.

## శబరిమల యాత్రికులకు గుడ్ న్యూస్

శబరిమల అయ్యప్ప భక్తులకు ట్రావెన్‌కోర్ దేవస్థానం బోర్డు శుభవార్త చెప్పింది. ఆలయంలో అందిస్తున్న అన్నదానం మెనూను పూర్తిగా మార్పు చేస్తున్నట్లు ప్రకటించింది. ఇప్పటివరకు భక్తులకు మధ్యాహ్న భోజనంలో వెజ్ పులావ్, సాంబారుతో భోజనం పెడుతున్నారు. ఇప్పుడు ఈ మెనూలో మార్పులు చేశారు. ఇకపై అప్పడాలు, పాయసంతో కూడిన సద్య అంటే పూర్తిస్థాయి కేరళ సంప్రదాయ భోజనం వడ్డించనున్నట్లు తెలిపింది. మంగళవారం జరిగిన బోర్డు సమావేశం అనంతరం కొత్త అధ్యక్షుడు కె. జయకుమార్ ఈ వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా జయకుమార్ స్పందిస్తూ- - - ఇది దేవస్వం బోర్డు డబ్బు కాదని, తోటి భక్తులకు ఉత్తమమైన భోజనం అందించాలనే ఉద్దేశంతో భక్తులు సమర్పించిన విరాళాలతో ఈ భోజనం ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. నాణ్యమైన పదార్థాలతో సంప్రదాయ కేరళ సద్యను అందించాలని నిర్ణయించామని వివరించారు. ఈ నిర్ణయం త్వరలోనే అమల్లోకి వస్తుందని ఆయన తెలిపారు. పంబలో కూడా అన్నదానం సేవలను మెరుగుపరుస్తామని, యాత్రికుల సౌకర్యార్థం ఒక సమగ్ర మాస్టర్ ప్లాన్‌ను రూపొందిస్తున్నామని అన్నారు. దీనిపై డిసెంబర్ 18న సమీక్షా సమావేశం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం మండల-మకరవిళక్కు సీజన్ కావడంతో ప్రతిరోజూ వేలాది మంది భక్తులు శబరిమలకు తరలివస్తున్నారు. అయినప్పటికీ భక్తులకు



ఎలాంటి ఇబ్బందులు లేకుండా స్వామివారికి దర్శనం జరిగేలా అన్ని ఏర్పాట్లు సజావుగా సాగుతున్నాయని బోర్డు తెలిపింది. ఆలయం వెనుక మాలికాపురంలోని అన్నదాన భవనంలోనే రోజూ 10,000 మందికి పైగా భక్తులకు ఉచితంగా భోజనం అందిస్తున్నారని తెలిపారు. ఈ సీజన్‌లో ఇప్పటికే లక్ష మందికి పైగా భక్తులు అన్నదానం స్వీకరించారని వెల్లడించారు. ఈ అన్నదాన సత్రంలో మొత్తం 235 మంది సిబ్బంది పనిచేస్తున్నారని, పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని స్పెషల్ ఆఫీసర్ సునీల్ కుమార్ తెలిపారు. భక్తులు కడిగిన ప్లేట్లు, గ్లాసులను వేడినీటితో డిష్‌వాషర్లలో మళ్లీ శుభ్రం చేస్తున్నట్లు ఆయన వివరించారు. ఈ కొత్త మెనూ మార్పు భక్తుల ఆధ్యాత్మిక అనుభూతిని మరింత పెంచుతుందని బోర్డు భావిస్తోంది.



## డిసెంబర్ 4, 5 తేదీల్లో పుతిన్ భారత పర్యటన

రష్యా అధ్యక్షుడు పుతిన్ డిసెంబర్ 4, 5 తేదీల్లో భారత్‌లో పర్యటించనున్నారు. 2021 తర్వాత పుతిన్ భారత్‌లో పర్యటించడం ఇదే తొలిసారి. కాగా జులైలో ఇరుదేశాల శిఖరాగ్ర సమావేశంలో భాగంగా ప్రధాని మోదీ రష్యాకు వెళ్లారు. అక్టోబర్‌లో బ్రిక్స్ సదస్సు సందర్భంగా రష్యాలోని కజన్‌లో మరోసారి వీరిద్దరూ సమావేశమయ్యారు. ఇటీవల చైనాలో జరిగిన షాంఘై సహకార సంస్థ సదస్సులో కూడా పుతిన్-మోదీలు భేటీ అయ్యారు.

## తిరుమలలో కంపార్టుమెంట్లు ఫుల్.. సర్వదర్శనానికి 15 గంటల సమయం

తిరుమలలో భక్తుల రద్దీ పెరిగింది. నిన్న వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు వేంకటేశ్వరస్వామిని దర్శించుకునేందుకు 30 కంపార్టుమెంట్లలో వేచియున్నారు. టోకెన్లు లేని భక్తులకు 15 గంటల్లో సర్వదర్శనం అవుతుందని టీటీడీ అధికారులు వివరించారు. గురువారం స్వామివారిని 59,548 మంది భక్తులు దర్శించుకోగా 25,781 మంది తలనీలాలు సమర్పించుకున్నారు.



## ఊహించని లుక్‌లో కీర్తిసురేష్

అందాలచిన్నది కీర్తి సురేష్ గురించి ఎంత చెప్పినా తక్కువే. ఈ అమ్మడు అందానికి ప్రతి ఒక్కరూ ఫిదా అవ్వాల్సిందే. ఈ బ్యూటీ తన అంద చందాలతో ఎంతో మంది మదిని దోచుకొని, తన క్యూట్ నెస్‌తో ఆకట్టుకుంది.ఈ బ్యూటీకి టాలీవుడ్, బాలీవుడ్, కోలీవుడ్‌లో మంచి ఫ్యాన్ ఫాలోయింగ్ ఉంది. ఇక నేను శైలజా సినిమాతో తెలుగు వెండితెరకు పరిచయమైన ఈ బ్యూటీ మొదటి సినిమాతోనే అందరినీ ఆకట్టుకుంటుంది. చాలా క్యూట్‌గా కనిపిస్తూ, టాలీవుడ్ కుర్రకారు మనసు దోచుకుంది. ఇక ఈ మూవీ రిజల్ట్ ఎలా ఉన్నప్పటికీ ఈ అమ్మడుకు మాత్రం వరసగా అవకాశాలు క్యూ కట్టాయి.ఇక ఈ సినిమా తర్వాత కీర్తి సురేష్ మహానటి మూవీతో ఓవర్ నైట్ స్టార్ హీరోన్ అయిపోయింది. ఈ మూవీలో ఈ అమ్మడు అచ్చం సావిత్రిలా కనిపించడమే కాకుండా, తన నటనతో విమర్శకుల నుంచి సైతం ప్రశంసలు అందుకుంది.

సూర్య www.suryaa.com EVENING EDITION 4PM

## బాక్సాఫీస్ వద్ద గుజరాతీ సినిమా ప్రభంజనం!

చాలా తక్కువ బడ్జెట్‌తో తెరకెక్కి బాక్సాఫీస్ వద్ద రికార్డు కలెక్షన్లు సాధించిన సినిమాలు చాలా అరుదుగా ఉంటాయి. అయితే అలాంటి అద్భుతాన్ని సృష్టించింది గుజరాతీ చిత్రం 'లాలో-కృష్ణ సదా సహాయతే'. ఈ సినిమా ప్రస్తుతం గుజరాత్ సినీ పరిశ్రమలో సంచలనం సృష్టిస్తోంది. కేవలం రూ.50 లక్షల బడ్జెట్‌తో తెరకెక్కిన ఈ చిత్రం ఇటీవలే విడుదలై అనుహ్య విజయాన్ని సాధించడమే కాకుండా ఈ చిత్రం ఇప్పటివరకు రూ.100 కోట్లకు పైగా కలెక్షన్లను రాబట్టింది. దీంతో గుజరాతీ సినిమాల బాక్సాఫీస్ చరిత్రలోనే ఒక అరుదైన రికార్డుగా నిలిచింది. సినిమా కంటెంట్, కథనానికి ప్రేక్షకులు ఫిదా కావడంతో ఈ స్థాయిలో వసూళ్లు దక్కాయి. ఈ సినిమాకు అంకిట్ సఖియా దర్శకత్వం వహించగా..



జాతీయ అవార్డు గ్రహీత మానసి పరేఖ్ నిర్మాతగా వ్యవహరించాడు. కారన్ జోషి ప్రధాన పాత్రలో నటించగా.. రీవా రాచ్ కథానాయికగా నటించింది. శ్రుహద్ గోస్వామి కీలక పాత్రల్లో నటించాడు.



## థార్డ్ వరల్డ్ దేశాలపై పంజా విసిరిన ట్రంప్

అమెరికాలోని వాషింగ్టన్ డీసీలో జరిగిన కాల్పుల ఘటనలో నేషనల్ గార్డ్‌కు చెందిన సైనికురాలు ఒకరు మృతిచెందారు. ఈ ఘటన నేపథ్యంలో ఆ దేశ అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ కీలక నిర్ణయం తీసుకున్నారు. థార్డ్ వరల్డ్ దేశాల నుంచి వలసలను శాశ్వతంగా నిలిపివేయనున్నట్లు ఆయన స్పష్టం చేశారు. సెక్యూర్టీ రిస్క్‌గా మారుతున్న విదేశీయుల్ని కూడా డిపోర్టు చేయనున్నట్లు ఆయన చెప్పారు. ఆఫ్ఘన్ దేశానికి చెందిన ఓ వ్యక్తి.. వాషింగ్టన్ డీసీలో నేషనల్ గార్డు సభ్యురాలిపై కాల్పులు జరిపి చంపేశాడు. ఈ ఘటన అమెరికాలో తీవ్ర కలకలం రేపింది. దీంతో ట్రంప్ సర్కారు.. వలసదారులపై కఠిన చర్యలు తీసుకునేందుకు రెడీ అయ్యింది.

# సాంకేతికతను అందిపుచ్చుకునే హబ్‌గా అమరావతి

ఏపీ రాజధాని అమరావతి నిర్మాణానికి రైతులు స్వచ్ఛందంగా ముందుకొచ్చారని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. 34వేల ఎకరాలు ఇచ్చిన రైతులకు మనస్ఫూర్తిగా ధన్యవాదాలు తెలిపారు. అమరావతి అన్‌స్టాపబుల్‌గా దూసుకెళ్లేందుకు కేంద్రప్రభుత్వం అన్ని విధాలా సహకరించాలని కోరారు. రాబోయే ఐదేళ్లు కేంద్రం రాష్ట్రానికి సహకరిస్తే నిలదొక్కుకోవటంతో పాటు దేశ ఆర్థిక ప్రగతికి వెన్నుముకగా నిలుస్తామని చెప్పకొచ్చారు. రాజధాని అమరావతిలో ఇవాళ(శుక్రవారం) ప్రభుత్వ రంగ బ్యాంకులు, బీమా కంపెనీల ప్రధాన కార్యాలయాలకు శంకుస్థాపన చేశారు కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్, ముఖ్యమంత్రి చంద్రబాబు. మొత్తం 15 బ్యాంకులు, బీమా సంస్థల ప్రధాన కార్యాలయాలకు శంకుస్థాపన జరిగింది. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, యూబీఐ, కెనరాబ్యాంక్, ఏపీ గ్రామీణ బ్యాంక్, ఐడీబీఐ, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ ఇండియా, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, పంజాబ్ నేషనల్ బ్యాంక్, ఎల్ఐసీ, నాబార్డ్ బ్యాంకుల ప్రధాన కార్యాలయాలకు శంకుస్థాపన జరిగింది. ఈ కార్యక్రమానికి ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రులు నారా లోకేష్, నారాయణ, పయ్యావుల కేశవ్, కందుల దుర్గేశ్, కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ఆయా బ్యాంకుల చైర్మన్లు, సీఎండీలు ఉన్నతాధికారులు హాజరయ్యారు. అనంతరం సీఎం చంద్రబాబు ప్రసంగించారు. సముద్రంలో కలిసే మిగులు జలాలు వాడుకుని దేశానికి ఆర్థిక తోడ్పాటు ఇచ్చే పోలవరం అనుసంధాన ప్రాజెక్టుకు సహకరించాలని నిర్మలాసీతారామన్‌ను కోరారు. రాయలసీమను హార్టీకల్చర్ హబ్‌గా అభివృద్ధి చేసేందుకు సహకరించాలని సూచించారు. పూర్వోదయ ప్రాజెక్టు ద్వారా ఉత్తరాంధ్రకు ఎంతో మేలు జరిగే



అవకాశం ఉందని.. అందుకు తగిన సహాయం అందించాలని విన్నవించారు. రాజధాని రైతులకు క్యాపిటల్ గెయిన్స్ మినహాయింపు మరో రెండేళ్లు పొడిగించాలని నిర్మలాసీతారామన్‌కు విజ్ఞప్తి చేశారు సీఎం చంద్రబాబు. 'ఏపీలో జగన్ హయాంలో ఐదేళ్లు విధ్వంసం జరిగింది. ప్రధానమంత్రి నరేంద్రమోదీ వచ్చి రాజధాని పనులను పున:ప్రారంభించారు. కేంద్ర సహకారంతోనే అమరావతి పనులు శరవేగంగా జరుగుతున్నాయి. 2028 మార్చి నాటికి పూర్తిచేసేలా పనులు జరుగుతున్నాయి. పనుల వేగవంతానికి ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ముఖ్యకారణం. మాకంటే వేగంగా అమరావతికి రూ.15వేల కోట్ల నిధులు ఇచ్చారు. దేశ ఆర్థిక వ్యవస్థను నిర్మల గాడిన పెడుతూ వస్తున్నారు. ఇక్కడున్న ఫైనాన్షియల్ సిటీ దేశంలో ఎక్కడా లేదు. వినూత్నమైన నగరాన్ని నిర్మిస్తున్నాం. రూ.1,334 కోట్లతో 15 బ్యాంకులు, బీమా సంస్థలకు శంకుస్థాపనలు జరిగాయి. బ్యాంక్ కార్యాలయాలన్నీ ఒకేచోట ఉండటంతో ఎన్నో ప్రయోజనాలు ఉంటాయి. 6,576 మందికి ఉపాధి అవకాశాలు వస్తాయి' అని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు.

## హాంగ్‌కాంగ్ అగ్నిప్రమాదంలో 128కి చేరిన మృతుల సంఖ్య

హాంగ్ కాంగ్ రెసిడెన్షియల్ కాంప్లెక్స్‌లో జరిగిన అగ్నిప్రమాదంలో మరణించిన వారి సంఖ్య 128కి చేరుకున్నది. ఆ టవర్స్‌లో మరికొంత మంది మృతదేహాలను అధికారులు గుర్తించారు. టవర్స్ వద్ద బాధితుల కోసం గాలింపు కొనసాగుతున్నదని, మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు భద్రతా కార్యదర్శి క్రిస్ టాంగ్ తెలిపారు. వాంగ్ పుక్ కోర్టు కాంప్లెక్స్‌లో బుధవారం మధ్యాహ్నం అగ్ని ప్రమాదం సంభవించింది. శుక్రవారం ఉదయం ఆ మంటల్ని ఆర్పేశారు. ఈ ప్రమాదంలో సుమారు 79 మంది గాయపడినట్లు తెలుస్తోంది. అయితే మరణించిన వారిలో ఇంకా 89 మంది మృతదేహాలను గుర్తించలేదని అధికారులు చెప్పారు. అగ్నిమాదం జరగడానికి కారణాలను అన్వేషిస్తున్నారు. అయితే లోయర్ లెవల్‌లో మొదలైన మంటలు.. ఆ తర్వాత పై అంతస్తులకు పాకినట్లు అధికారులు పేర్కొన్నారు. కానీ దేని వల్ల ప్రమాదం జరిగిందన్న విషయం ఇంకా తెలియలేదన్నారు. ఈ కేసులో విచారణ కొనసాగుతున్నట్లు అధికారులు చెప్పారు. మంటలు పూర్తిగా వ్యాపించిన సమయంలో.. ఆ టవర్స్ వద్ద 500 సెంటిగ్రేట్ టెంపరేచర్ ఉన్నట్లు తెలిపారు. ఆ వేడి ధాటికి అర్పిన ప్రదేశాల్లోనూ మళ్లీ మంటలు అంటుకున్నట్లు అగ్నిమాపక సిబ్బంది పేర్కొన్నది.






## 70 ఏళ్లుగా రోడ్డు లేని గ్రామం...

### అజ్మీర మాంగ్యాతండా గిరిజనుల ఆవేదన!

ఉమ్మడి వరంగల్ జిల్లా నర్సంపేట ప్రాంతంలోని నెక్కొండ మండలం అజ్మీర మాంగ్యాతండా గ్రామం ఇప్పటికీ అభివృద్ధి కొండగట్టుగా నిలిచిపోయింది. స్వాతంత్ర్యం వచ్చి 78 ఏళ్లు దాటినా, ఈ గిరిజన తండాకు ఒక్క మెట్టు రోడ్డు కూడా లేకపోవడం ఆందోళన కలిగిస్తోంది. గ్రామ పంచాయతీగా ఏర్పడి దశాబ్దాలు గడుస్తున్నా రోడ్డు సమస్య పరిష్కారం కాలేదు. దీంతో గ్రామస్తులు రోజువారీ జీవితంలోనే కాకుండా, అత్యవసర సమయాల్లో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు లేకపోవడంతో పిల్లలు పాఠశాలకు వెళ్లడం, రోగులను ఆసుపత్రికి తరలించడం అసాధ్యమైపోయింది. వర్షాకాలంలో కాలి దారులు జారుడు బంకితో నిండిపోతాయి. గర్భిణీ స్త్రీలను, తీవ్ర అస్వస్థతకు గురైన వారిని దూరంలోని ఆసుపత్రికి చేర్చడానికి గ్రామస్తులు ఇప్పటికీ దోమల కట్టు, కటిక బండ్లు ఉపయోగిస్తున్నారు. ఈ పరిస్థితి చూసి పెళ్లి సంబంధాలు కూడా రావడం మానేశాయని స్థానికులు బాధపడుతున్నారు. ఎన్నికలు వచ్చినప్పుడల్లా నాయకులు, అధికారులు గ్రామానికి వచ్చి రోడ్డు వేస్తామని హామీ ఇస్తారు. ఓట్లు వేసిన తర్వాత మాత్రం ఎవరూ పట్టించుకోరు. "మా గ్రామం వైపు రావడానికే భయపడతారు, మా బాధలు ఎవరు పట్టించుకుంటారు ?" అంటూ గ్రామస్తులు ఆగ్రహంతో ఆవేదన కలిపి ప్రశ్నిస్తున్నారు. ఈ హామీల గాండ్రాభం దశాబ్దాల నుంచి కొనసాగుతోందని వారు ఆరోపిస్తున్నారు. అజ్మీర మాంగ్యాతండా గ్రామం ఇప్పుడు అభివృద్ధి నుంచి పూర్తిగా వివక్షకు గురైనట్టు కనిపిస్తోంది.

## వైసీపీ లీగల్ సెల్ న్యాయవాదిపై కేసు నమోదు

వైసీపీ లీగల్ సెల్ న్యాయవాది వెంకటేశ్ శర్మపై మాచవరం పోలీసులు కేసు నమోదు చేశారు. విడాకుల కేసు మాట్లాడేందుకు వెళ్లిన ఓ మహిళతో అసభ్యంగా ప్రవర్తించాడు వెంకటేశ్ శర్మ. ఈ క్రమంలో ఆయనపై మాచవరం పోలీసులకు ఫిర్యాదు చేశారు బాధితురాలు. ఆమె ఫిర్యాదు మేరకు న్యాయవాది వెంకటేశ్ శర్మపై కేసు నమోదు చేశారు. వెంకటేశ్ శర్మపై 75 (1)(i) సెక్షన్ కింద కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలోనే వెంకటేశ్ శర్మపై గతంలో వచ్చిన ఫిర్యాదులపై ఆరా తీస్తున్నారు పోలీసులు. వెంకటేశ్ శర్మ మహిళలతో అసభ్యంగా ప్రవరిస్తునట్లు గుర్తించారు. పలు క్లబ్బుల్లో మహిళలపై కరెన్సీ విసిరి వేస్తున్న వీడియోలు సైతం సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. డబ్బు కట్టలతో వెంకటేశ శర్మ తీసుకున్న వీడియోలు కూడా వైరల్ కావటంతో విచారిస్తున్నారు మాచవరం పోలీసులు.

## ఇక నుండి పోరాటమే అంటున్న సమంత

టాలీవుడ్ స్టార్ హీరోయిన్ సమంత.. ప్రస్తుతం మా ఇంటి బంగారం అనే సినిమాను చేస్తోంది. ఈ మధ్య కాస్త సినిమాలు తగ్గించిన సామ్.. తన బిజినెస్ లు చూసుకుంటూ ఆరోగ్యంపై దృష్టి పెట్టింది. సోషల్ మీడియాలో హైపర్ యాక్టివ్ గా ఉండే సమంత తరచూ.. హెల్త్ కి సంబంధించిన వీడియోలు చేస్తూ ప్రచారం చేస్తుంది. ఇక తాజాగా సమంత పెట్టిన ఓ వీడియో నెట్టింట్లో వైరల్ గా మారింది. నవంబర్ 25 నుంచి డిసెంబర్ 10 వరకు.. 16 రోజుల పాటు జరగనున్న ఈ కార్యక్రమంలో తను పాల్గొంటున్నట్టు.. తనతో పాటు ఆ కార్యక్రమంలో మీరందరూ కూడా పాల్గొనండంటూ తెలుపుతూ ఓ వీడియో పోస్ట్ చేసింది సామ్. ఇక ఈ వీడియోలో సమంత మాట్లాడుతూ.. మహిళల మీద హింసని ముగించాలి అనే కార్యక్రమం సందర్భంగా మీకొక మెసేజ్. మనం హింస గురించి ఆలోచించినప్పుడు వీధుల్లో, ఇంట్లో, వర్క్ ప్లేసెస్ లో జరుగుతుందని అనుకుంటాము. కానీ ఇప్పుడు ఆన్ లైన్ లో కూడా జరుగుతుంది. ముగ్గురిలో ఒక మహిళ హింసని ఎదుర్కొంటుంది.



## అండర్-19 ఆసియా కప్‌లో చోటు.. కెప్టెన్‌గా వైభవ్

భారత క్రికెట్ భవిష్యత్తుకు పునాది వేసే టోర్నమెంట్లలో ఒకటైన అండర్-19 ఆసియా కప్ కోసం టీమిండియా జట్టును ప్రకటించారు. యువ క్రికెట్‌లో ప్రస్తుతం హాట్‌టాపిక్‌గా ఉన్న, 14 ఏళ్ల సంచలనం వైభవ్ సూర్యవంశీ ఈ జట్టులో స్థానం దక్కించుకున్నాడు. డిసెంబర్ 12 నుంచి 21 వరకు దుబాయ్‌లో జరగనున్న ఈ వన్డే టోర్నమెంట్, వచ్చే ఏడాది జరగబోయే అండర్-19 ప్రపంచకప్‌కు సన్నాహకంగా కూడా ఉపయోగపడుతుంది. అయితే జట్టులో అత్యంత ఆకర్షణ అయిన వైభవ్ సూర్యవంశీకి కాకుండా, 17 ఏళ్ల మరో యువ ఆటగాడికి కెప్టెన్సీ దక్కింది. బీసీసీఐ నవంబర్ 28, శుక్రవారం నాడు అండర్-19 ఆసియా కప్ 2025 కోసం భారత స్క్వాడ్‌ను ప్రకటించింది. ఈ టోర్నమెంట్‌కు 15 మంది ఆటగాళ్లను ఎంపిక చేయగా, నలుగురిని స్టాండ్‌బైగా సెలక్ట్ చేశారు. ఈ జట్టులో అందరి దృష్టిని ఆకర్షించిన ఆటగాడు వైభవ్ సూర్యవంశీ. అయితే జట్టు పగ్గాలను 14 ఏళ్ల వైభవ్‌కు కాకుండా, జట్టులో సీనియర్‌గా ఉన్న 17 ఏళ్ల ఆయుష్ మాత్రేకు అప్పగించారు. ఈ ఏడాది జూలైలో ఇంగ్లాండ్ పర్యటనలో కూడా ఆయుష్ అండర్-19 జట్టుకు నాయకత్వం వహించాడు. వైస్ కెప్టెన్సీ బాధ్యతలను




విహాన్ మల్హోత్రాకు అప్పగించారు. ఈ స్క్వాడ్‌లో అత్యంత ముఖ్యమైన ఆటగాడు ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ. గతంలో ఆసియా కప్ రైజింగ్ స్టార్ లాంటి టోర్నమెంట్‌లో అద్భుత ప్రదర్శన చేసిన వైభవ్, ఇప్పుడు అండర్-19 ఆసియా కప్‌లో తన సత్తా చాటడానికి సిద్ధమయ్యాడు. వైభవ్ ఈ టోర్నమెంట్‌లో కూడా ఓపెనర్‌గా బాధ్యతలు తీసుకుని, జట్టుకు వేగవంతమైన ఆరంభాన్ని ఇవ్వాలని చూస్తున్నాడు. గత ఇంగ్లాండ్ పర్యటనలో వైభవ్.. మెన్స్ యూత్ వన్డేలలో అతి చిన్న వయసులో సెంచరీ చేసిన బ్యాట్స్‌మెన్‌గా రికార్డు సృష్టించాడు. కేవలం 52 బంతుల్లోనే సెంచరీ పూర్తి చేసుకున్న వైభవ్, ఆసియా కప్‌లోనూ అలాంటి అద్భుతాలు చేయాలని అభిమానులు కోరుకుంటున్నారు.

భారత అండర్-19 స్క్వాడ్


ఆయుష్ మాత్రే(కెప్టెన్), విహాన్ మల్హోత్రా(వైస్-కెప్టెన్), వైభవ్ సూర్యవంశీ, వేదాంత్ త్రివేది, అభిజ్ఞాన్ కుండూ (వికెట్ కీపర్), హర్వంశ్ సింగ్, యువరాజ్ గోహిల్, కనిష్క్ చౌహాన్, ఖిలన్ ఎ పటేల్, నమన్ పుష్పక్, డి దీపేష్, హెనిల్ పటేల్, కిషన్ కుమార్ సింగ్, ఉద్ధవ్ మోహన్ , ఐరాన్ జార్జ్, రాహుల్ కుమార్, హేమ్‌చుదేశన్ జె, బికె కిషోర్, ఆదిత్య రావత్.

భారత్ షెడ్యూల్, ప్రత్యర్థులు

ఈ టోర్నమెంట్‌లో మొత్తం 8 జట్లు పాల్గొంటాయి. భారత్, పాకిస్థాన్‌లు గ్రూప్ Aలో ఉన్నాయి.

## మాజీ నక్సలైట్ దారుణ హత్య

రాజన్న సిరిసిల్ల జిల్లా అగ్రహారం గుట్టల్లో మాజీ నక్సలైట్ దారుణ హత్యకు గురయ్యాడు. హత్య ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మాజీ నక్సలైట్‌ని తంగళ్లపల్లి మండలం



గండిలచ్చపేట గ్రామానికి చెందిన సిద్దయ్య ఆలియాస్ నర్సయ్య (50)గా గుర్తించారు. ఈ ఘటనతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. సిద్దయ్యను బండరాళ్లతో తలపై కొట్టి దారుణంగా హత్య చేశాడు సంతోశ్ అనే వ్యక్తి. గతంలో నక్సల్స్ ఉద్యమంలో పని చేసి, లొంగిపోయాడు సిద్దయ్య. ఓ యూట్యూబ్ ఛానెల్ ఇంటర్వ్యూ ఉందని సిద్దయ్యను పిలిచాడని... ఓ ప్లాన్ ప్రకారమే సంతోశ్ హత్య చేసినట్లుగా వార్తలు వస్తున్నాయి. హత్య చేసిన అనంతరం జగిత్యాల పోలీసు స్టేషన్‌లో నిందితుడు సంతోశ్ లొంగిపోయినట్లు సమాచారం. నిందితుడుపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు. అసలు సిద్దయ్యను హత్య చేయడానికి గల కారణాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు. సిద్దయ్య మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించినట్లు తెలుస్తోంది. సిద్దయ్య మృతితో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. గండిలచ్చపేట గ్రామస్తులు సిద్దయ్య కుటుంబాన్ని పరామర్శించి సంతాపం వ్యక్తం చేస్తున్నారు.